క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో కుందన కౌశిక్‌కు కాంస్య పతకం


కుందన కౌశిక్

దెందులూరు: 68వ పోటీల్లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో దెందులూరు నియోజకవర్గ విద్యార్థులు పాల్గొని ప్రతిభచూపారని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం అసీన్ వలీ అన్నారు. ఈనెల 3 నుంచి ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహిస్తున్న రెజ్లింగ్ పోటీలకు దెందులూరు నియోజకవర్గం నుంచి పోతునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి తాతినేని కుందన కౌశిక్, అండర్ 14 ఫ్రీ స్టైల్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు హెచ్ఎం షేక్ అసీన్‌వలీ, ఫిజికల్ డైరెక్టర్ ఎం కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది మండల ఎంఈఓలు ఏవీఎస్ వరప్రసాద్, కే.అన్నమ్మ, నాయకులు కౌశిక్‌ను అభినందించారు.

గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విప్లవం


జోగన్నపాలెంలో వరి పంటకు డ్రోన్ ద్వారా స్ప్రే చేస్తున్న డ్రోన్

దెందులూరు: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రామీణ శివారు ప్రాంతాల్లో రైతాంగం సాంకేతిక పరిజ్ఞానం వైపు మొగ్గు చూపుతున్నారు. సాధారణ వ్యవసాయం నుంచి సేంద్రి య వ్యవసాయం, సాంకేతిక పరికరాల విని యోగంపై రైతుల్లో ఆసక్తి నెలకొంది. దీంతో గ్రామాల్లో వరి పొలాల్లో పురుగుమందు పిచికారీకి డ్రోన్ల వినియోగం పెరిగింది. డ్రోన్‌తో పిచి కారీ చేయించడంవల్ల వరి దుబ్బు అంతటికీ పూర్తిస్థాయిలో మందు పడుతోందని, సమ యం ఆదా అవుతోందని రైతులు తెలిపారు. దీంతో కూలీల సంఖ్య తగ్గడం, సాగులో సంతృప్తికరమైన దిగుబడి వస్తోందని వారన్నారు. దీంతో ప్రైవేటు కంపెనీలు డ్రోన్లను గ్రామా ల్లోని రైతులకు ఏజెంట్లద్వారా సరఫరా చేస్తున్నారు.

వెంకన్నకు 108 వెండి పుష్పాల సమర్పణ


గుండుగొలనులో వెండి పుష్పాలు సమర్పిస్తున్న భక్తుడు వగ్వాల నాగ శ్రీహరి

భీమడోలు: దసరా ఉత్సవాల్లో భాగంగా గుండుగొలనులో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ఆదివారం ఓ భక్తుడు బంగారు పూతగల 108 వెండి పుష్పాలను బహూకరించి తన భక్తిని చాటుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు వగ్వాల నాగ శ్రీహరి స్వామి వారికి రూ.61,100 వ్యయంతో 750 గ్రాముల బరువు గల బంగారు పూత గల 108 వెండి పుష్పాలను ఆలయ కమిటీ పెద్దలు వగ్వాల అచ్యుత రామారావు, పూజారి మంగపతి ఆచార్యులకు అందజేసారు. తొలుత ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పెద్దలు ఘన స్వాగతం పలికారు.

వర్గీకరణ చేస్తే తిరుగుబాటు తప్పదు

గణపవరం: ఎస్సీ వర్గీకరణ చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలో భాగమని, ఎస్సీల వర్గీకరణ చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటు తప్పదని మాలమహానాడు అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ చైర్మన్ సీహెచ్ మంగరాజు హెచ్చరించారు. గణపవరంలో నిర్వహించిన మాలమహానాడు ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన చేసిన తర్వాతే వర్గీకరణ విషయం ఆలోచించాలని కోరారు. చంద్రబాబు దళితులను విడదీసి మంద కృష్ణ మాదిగను ప్రోత్సహిస్తూ మాలలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. త్వరలో విజ యవాడలో ఉమ్మడి రాష్ట్రస్థాయిలో మాలల మహాసభ నిర్వహించి మాలల గొంతు వినిపిస్తామన్నారు. మాలమహానాడు నాయకులు చోడదాసి జైపాల్, వెన్నపు సుధాకర్, సబ్బితిరాజు సునీల్, అచ్చిబాబు, కొండయ్య, జయకుమార్ పాల్గొన్నారు.

ఇంటి గుమ్మం తలకు తగిలి మృత్యువాత

ఉంగుటూరు: నారాయణపురం ఎన్టీఆర్ కాలనీలో ఉంటున్న పెద్ద కుమార్తె దేవ దుర్గ, అల్లుడు మణికంఠసాయి ఇంటికి ఆదివారం నిడదవోలు నుంచి శ్రీనివాసరావుకు(55) ఇంటి వద్ద గుమ్మం తలకు బలంగా తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే శ్రీనివాసరావును భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే శ్రీనివాసరావు చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన శ్రీనివాసరావుకు భార్య, వివాహం అయిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పర్యావరణానికి ప్లాస్టిక్ ముప్పు


రోడ్డుపక్కన ప్లాస్టిక్ వ్యర్థాలను తగులబెడుతున్న దృశ్యం


రోడ్డుపక్కన కొండలా పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు


డ్రెయినేజీలో పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

- ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే
- నిషేధాజ్ఞలను పట్టించుకోని వైనం
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

గణపవరం: ప్లాస్టిక్ వ్యర్థాలతో గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా ఉక్కిరి బిక్కిరి అవుతున్నాయి. ఏ ప్రాంతానికి వెళ్లినా ప్లాస్టిక్ వ్యర్థాల కంపుతో ముక్కుమూసుకోవాల్సి వస్తోంది. చెత్తకుప్పలు, పంట, మురుగు కాలువలు, డ్రెయినేజీలు ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ నిభంధనలకు నీళ్లొదిలి, నిబంధనలను అధికారులు, ప్రజలు పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఓ వైపు ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ప్లాస్టిక్ రీసైక్లింగ్ అంతంత మాత్రంగానే ఉంటోంది. దీనితో పర్యావరణానికి ప్లాస్టిక్ ముప్పు అంతకంతకు పెరుగుతోందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లలో, దుకాణాల వద్ద ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలు రోజూ పోగుచేసే చెత్తలో 60 నుంచి 70 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి.

రోజుకు 40 నుంచి 50 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు

జిల్లా వ్యాప్తంగా పట్టణం, గ్రామం అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వాడకం యథేచ్ఛగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా రోజుకు 40 నుంచి 50 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా. తొలుత 40 మైక్రాన్ల మందమున్న ప్లాస్టిక్ కవర్లనే వాడాలనే నిబంధన ఉండేది. 2016లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు వాడవచ్చునని ప్రకటించింది. దీనితో పాటు ఆస్పత్రుల్లో విడుదలయ్యే బయో వ్యర్థాలపై కూడా కఠిన ఆంక్షలు విధించింది. ఎక్కడైతే బయో వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయో ఆ సంస్థలే వాటిని నిర్వీర్యం చేసే బాధ్యత వహించాలని ప్రకటించింది. ఈ నిబంధనలు ఎక్కడా పూర్తిగా అమలు కావడం లేదు.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంతో ప్రమాదకర జబ్బులు, క్యాన్సరుతో పాటు స్త్రీలలో సంతానోత్పత్తి సమస్యలు వస్తున్నాయి.

అరకొరగా తనిఖీలు

ఇటీవల 20 మైక్రాన్ల మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా అందుబాటులోకి వచ్చాయి. మార్కెట్లో కిరాణా షాపుల నుంచి చికెన్ సెంటర్ల వరకూ 20 మైక్రాన్ల కవర్లే వాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు ఉత్పత్తి చేసినా, వినియోగించినా రూ.25 వేల వరకూ జరిమానా విధించే నిబంధన ఉన్నా ఎక్కడా అమలవుతున్న దాఖలాల్లేవు. నాసిరకం ప్లాస్టిక్ బ్యాగుల నియంత్రణ లీగల్ మెట్రాలజీ పరిధిలోకి వస్తుంది. ఆ శాఖ అధికారులు వీటిని నియంత్రిస్తున్న జాడ కనిపించదు. కొన్ని టీ స్టాల్స్‌లో వేడి టీ, కాఫీలు ప్లాస్టిక్ కవర్లలోనే ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాల గుట్టలు దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికులకు రోజూ డ్రెయిన్లలో చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తలకుమించిన పనిగా మారింది.

ఏది సురక్షితం.. ఏదిహాని

ప్లాస్టిక్ తయారీ వస్తువులకు నంబర్లు ఉంటాయి. ఒక్కో నంబరు ఒక్కో క్వాలిటీని సూచిస్తుంది. 1, 2, 4, 5 నంబర్లు సూచించే ప్లాస్టిక్‌ను వాడుకోవచ్చును. 3, 6, 7 నంబర్లు సూచించే ప్లాస్టిక్ దూరంగా ఉంచాలి. 30 లేదా 20 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ బ్యాగులు హాని తలపెడతాయి. పాలీవినైల్, లేదా పీవీసీ ప్లాస్టిక్‌లు వాడకూడదు. ప్లాస్టిక్ సామగ్రిలో ఆహార పదార్థాలు ఉంచి మైక్రోఓవెన్లలో వేడిచేసి తినకూడదు. చల్లని, లేదా వేడి పానీయాలను పాలీకార్బొనేట్ ప్లాస్టిక్ బాటిళ్లలో నింపి తాగడానికి వాడుకోవాలి.

ప్లాస్టిక్ వ్యర్థాలతో భయంకర జబ్బులు


కాలువలో కొట్టుకొస్తున్న ప్లాస్టిక్ సీసాలు


రోడ్డుపక్కన పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ కవర్లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తింటే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. మహిళల్లో పునరుత్పత్తికి హానిచేసే అవకాశాలు ఎక్కువ. వ్యాధి నిరోధక శక్తి భారీగా తగ్గే ప్రమాదం ఉంటుంది. జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. లైంగిక సంబంధమైన హార్మోన్లు గణనీయంగా తగ్గుతాయి. వ్యాధికారక పదార్థమైన ప్లాస్టిక్ రేణువులు శరీరంలోకి చేరి పలు రకాల జబ్బులు వచ్చే అవకాశాలున్నాయి. గుండె జబ్బులు రావడానికి ప్లాస్టిక్ వ్యర్థాలు ఒక కారణంగా ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

జగజ్జననికి జేజేలు


గుండుగొలనులో గాయత్రీదేవిగా భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి


దెందులూరులో లలితాదేవి అలంకరణలో పెద్దింట్లమ్మ తల్లి


గోపన్నపాలెంలో లలితాదేవి అలంకరణలో అమ్మవారు


కురెళ్లగూడెంలో అమ్మవారి ఆలయాన్ని కొబ్బరి బొండాలతో ముస్తాబు చేసిన దృశ్యం


గోపన్నపాలెంలో 108 కలశాలతో భక్తుల ఊరేగింపు

ఘనంగా శరన్నవరాత్రి పూజలు

భీమడోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన అమ్మవారు భక్తులకు వివిధ రూపాలల్లో దర్శనమిచ్చారు. చలువ పందిళ్లల్లో కొలువైన అమ్మవార్లకు, ఆలయాల్లోని అమ్మవార్లను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని విశేష పూజలు చేశారు. మండలంలోని గుండుగొలను, కురెళ్లగూడెం, పూళ్ల, ఎంఎంపురం, భీమడోలు, నరెడ్లగూడెం తదితర గ్రామాల్లోని దుర్గామాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భభక్తులకు దర్శనమిచ్చారు. కురెళ్లగూడెంలో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. అమ్మవారి పందిరిని కొబ్బరి బొండాలతో అలంకరించారు. నరెడ్లగూడెంలో గద్దెపై ఉన్న అమ్మవారికి, గుండుగొలను వేంకటేశ్వర ఆలయంలో అమ్మవారికి, భీమడోలు గోదావరి కాలువ గట్టుపై అమ్మవారి భారీ విగ్రహానికి విశేష పూజలు చేశారు. గుండుగొలనులోని జగన్న కాలనీలో దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు


మండలపర్రులో లలితా దేవి అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గామాత

దెందులూరు: దసరా మహోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో అలంకరణలు, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం దెందులూరులో పెద్దింట్లమ్మ అమ్మవారి లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గోపన్నపాలెంలో ఆలయ కమిటీ సభ్యులు తోట రామకృష్ణ, గ్రామ మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, కమిటీ సభ్యులు అమ్మవారిని లలితాదేవి అలంకరణ చేశారు. గ్రామానికి చెందిన భక్తులు 108 కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అనంతరం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. దెందులూరు, కొత్తపల్లి, జోగన్నపాలెం, కొవ్వలి, పోతునూరు, సీతంపేట, సోమవరప్పాడు గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు


గణపవరంలో కనకదుర్గ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గణపవరం: దేవీనవరాత్రి ఉత్సవాలు వాడవాడలా వైభవంగా కొనసాగుతున్నాయి. గణపవరంలోని ప్రసిద్ధి చెందిన కంచికామాక్షి అమ్మవారి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయం వద్ద రంగురంగుల విద్యుత్ దీపాలకంరణలు చేశారు. ఆలయ ట్రస్టీ తెలగారెడ్డి బాబీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బస్టాండు వద్ద కనకదుర్గ అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. సరిపల్లె, కొత్తపల్లి, జల్లికొమ్మర, పిప్పర, అర్ధవరం, మొయ్యేరు, కాశిపాడు, చిలకంపాడులో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

మండలపర్రులో లలితాదేవి అలంకరణలో..

నిడమర్రు: మండలంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు ఆదివారం బాలా త్రిపుర సుందరి, లలీతా దేవి, అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గా మాత దర్శనమిచ్చారు. మండలపర్రు పంచాయతన క్షేత్రంలో అమ్మవారు లలితా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

రహదారి మలుపులు.. ప్రమాద ఘంటికలు


నారాయణపురంలో కో ఆపరేటివ్ బ్యాంకు సమీపంలో ప్రమాదకర మలుపు

ఉంగుటూరు: గణపవరం నుంచి వయా నారాయణపురం మీదుగా దూబచర్ల వెళ్లే రాష్ట్ర ఆర్అండ్‌బీ రహదారి మలుపులు ప్రమాద ఘంటికలుగా మారాయి. ఈ మలుపుల వద్ద ప్రమాదపు అంచున ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు వాహనచోదకులు ఎదుర్కొంటున్నారు. ఈ మలుపుల్లో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కొన్ని ప్రమాదాల్లో ప్రయాణికులు, వాహనదారులు మృత్యువాత పడ్డారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. గణపవరం నుంచి దూబచర్ల మధ్యలో ఉంగుటూరు మండలం ప్రధానంగా ఉంది. రాచూరులో 4 ప్రమాదకర మలుపులున్నాయి. నారాయణపురం నుంచి రావులపర్రు వంతెన మధ్యలో 8 మలుపులున్నాయి. చేబ్రోలు నుంచి దూబచర్ల మధ్యలో 10 మలుపులున్నాయి. ఒకప్పుడు పుంత దారిగా ఉన్న ఈ రహదారిని కాలక్రమంలో ఆర్అండ్‌బీ రహదారిగా మార్చారు. ఆనాటి నుంచి ఈ రోడ్డు మీదుగా భారీ వాహనాలు, కార్లు రాకపోకలు పెరిగాయి. పుంత రహదారి స్వరూపాన్ని మార్చు చేయకుండా యథాతథంగా ఆర్అండ్‌బీ అధికార్లు తారు రోడ్డు నిర్మించారు. మలుపులను తగ్గించేందుకు కనీసం ప్రతిపాదనలు చేయలేదు. పాలకులు కూడా దీనిపై దృష్టి సారించలేదు. పెరుగుతున్న రవాణా, వాహనాల సంఖ్య ఆధారంగా ఈ రోడ్డును విస్తరించి మలుపులు లేకుండా పునఃనిర్మించాల్సి ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి ప్రస్తుతం డెల్టాలోని ప్రస్తుత పశ్చిమగోదావరి జిల్లాకు, విజయవాడ, ఏలూరు, అమరావతి వంటి ఇతర ప్రధాన నగరాలకు వెళ్లాలన్నా, జాతీయ రహదారికి వెళ్లాలన్నా భీమవరం నుంచి నారాయణపురం వరకు ప్రధాన మార్గంగా మారింది. వేలాది మంది వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. దాంతో విపరీతమైన రద్దీ పెరిగింది. చేపల లోడుతో వందలాది లారీలు కోల్‌కతా, ఈశాన్య రాష్ట్రాలకు ఈ రహదారి మీదుగా వెళుతున్నాయి. ప్రమాదకర మలుపుల వద్ద ఏమాత్రం ఏమరపాటుతో ఉన్నా ప్రమాదానికి గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. మలుపులు లేకుండా రహదారిని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.


రావులపర్రు మురుగుకోడు వంతన వద్ద మలుపు


నారాయణపురం -రావులపర్రు మధ్యలో ప్రమాదాలకు నిలయమైన మలుపు

ఆఖరి మజిలీకి అండగా 'మానవత'

- వైకుంఠ రథాలతో సేవలందిస్తున్న సంస్థ
- అనాథ మృతదేహాలకు ఉచితంగా అంత్యక్రియలు
- కరోనా సమయంలో విశేష సేవలు


మానవత సంస్థ వైకుంఠ రథం


సంస్థ నుంచి ఉచితంగా అందించే ఫ్రీజర్ బాక్సు

దెందులూరు: నా అనుకునే వారికి ఏదైనా జరిగితే తల్లడిల్లిపోతాం, అలాంటిది వారు మరణిస్తే ఆ బాధ వర్ణనాతీతం. మరణించినవారి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు శ్మశాన వాటిక ఎక్కడో దూరాన ఉంటే పార్థీవదేహాన్ని తీసుకెళ్లేందుకు పడరాని పాట్లు పడుతుంటాం. అంత్యక్రియలను కూడా ప్రైవేటు వ్యవస్థ వ్యాపారంగా మార్చేసిన నేటి రోజుల్లో పూర్తి సేవాభావంతో మానవతా సంస్థ వైకుంఠ రథాలను అందుబాటులోకి తెచ్చింది. పాడె కట్టుకుని నలుగురు అతి ప్రయాసతో తీసుకెళ్లాల్సిన పరిస్థితిని మార్చేసి దుఃఖం నుంచి సాంత్వన కలిగించే భగవద్గీత శ్లోకాలు, బంధువులకు మనో ధైర్యాన్ని అందించే గీతాలు వినిపిస్తూ చక్కని ఆకారంతో శుభ్రమైన వైకుంఠ రథాలు అమూల్యమైన సేవలందిస్తున్నాయి.

నిరుపేదలకు ఆసరా

పేద, బడుగు, బలహీన వర్గాలకు ఈ మానవతా సంస్థ అండగా నిలుస్తోంది. పేదలకు, అంత్యక్రియలు చేయలేని పరిస్థితుల్లో ఉన్న వారికి సాయం చేసేందుకు మానవతా సంస్థ ముందడుగు వేస్తోంది. ఈ సంస్థ ద్వారా వైకుంఠ రథంలోనే పార్థీవదేహాన్ని తీసుకువెళ్లి అంత్యక్రియలు పూర్తి చేస్తున్నారు. ఇప్పటి వరకు మండలంతోపాటు, చుట్టుపక్కల గ్రామాల పరిధిలో మృతిచెందిన 154 మందికి సంస్థ ద్వారా అంత్యక్రియలు నిర్వహించారు. దాత దివంగత సుగ్గిశెట్టి సత్యనారాయణ (చంటి) ఫ్రీజర్ బాక్సు, ఒక వాహనం, స్టీల్ పాడెను సంస్థకు అందించారు.

ఆపత్కాలంలో అమూల్యమైన సేవలు



కరోనాలో దెందులూరుతో పాటు సమీప గ్రామాల్లో దాదాపు 68 పైగా మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించాం. రక్తసంబంధీకులైన కుటుంబ సభ్యులు సైతం మృతదేహాల వద్దకు రాని సమయంలో మానవతా సంస్థ ద్వారా సేవలందించాం. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఏలూరు ఆసుపత్రికి మానవతా వాహనం ద్వారా తరలిస్తున్నారు. వాహనం ఖాళీగా ఉన్నప్పుడు గ్రామంలో అనారోగ్యానికి గురైన వారిని వైద్యశాలకు తరలించి చికిత్స అనంతరం అక్కడి నుంచి తీసుకువస్తున్నాము.

– సుగ్గిశెట్టి నూకరాజు, మానవత సంస్థ అధ్యక్షులు

సంస్థ సేవలు వెలకట్టలేనివి



మానవత సంస్థ చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. కరోనా సమయంలో సైతం అందించిన సేవలు అభినందనీయం. దాతలు అంత్యక్రియలు నిమిత్తం ముందుచూపుతో తమ దాతృత్వాన్ని చాటుతూ వాహనం సమకూర్చడం భావితరాలకు ఆదర్శనీయం. ఆర్థికస్థితిగల దాతలు ముందుకు వచ్చి పేదల కోసం ఎంతోకొంత సహాయ సహకారాలు అందించడం హర్షణీయం. ఆదర్శవంతమైన సేవల ద్వారా సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది సమస్యలు పరిష్కారమవుతాయి.

– మొటపర్తి రాజా, సీనియర్ సిటిజన్, దెందులూరు